క్లుప్తంగా

నేడు పెనుమల్లిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ

పెడన: మండలంలోని పెనుమల్లి విజయకృష్ణ ఫంక్షన్ హాలులో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ పెడన కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి పెడన మండలంలోని వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులంతా తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా పార్టీ కార్యాలయం తెలిపింది. పెడన మండలంలో ఉన్నటువంటి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల సంఘాలకు చెందిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు తప్పకుండా హాజరుకావాలని పేర్కొంది.

210 మంది రోగులకు ఉచిత వైద్య సేవలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని 45వ డివిజన్ సచివాలయం వద్ద ఆదివారం యోగ ప్రభ సూపర్ స్పెషాలిటీ శ్రీ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో 210 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఆస్పత్రి వైద్యులు ముత్తేవి కృష్ణమాచార్యులు, రాజా రవికిరణ్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. 45వ డివిజన్ ఇన్‌చార్జి పీవీ ఫణి కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిబిరంలో రాష్ట్ర బీసీ సంఘ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, సీనియర్ ఆడిటర్ చిలకమర్రి శేషాచార్యులు (అప్పాజీ) పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామికి విశేష పూజలు



మచిలీపట్నం టౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీ మంత్రాలయ రాఘవేంద్ర స్వామి వారి 354 ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పూర్వారాధన, అష్టోత్తర శతనామ పారాయణ, పంచామృతాభిషేకం, తులసి దళార్చన, మధ్యాహ్నం మహా మంగళహారతి, అష్టోదక ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం వాసవి భజన మండలి బృంద సభ్యులు ఆలపించిన భక్తి కీర్తనలు ఆకట్టుకున్నాయి. స్వస్తి వాచనం నిర్వహించారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



నాగాయలంక: ఏపీ యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం యూనియన్ మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏవీఎస్ అండ్ టీకేఆర్ యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా శాఖ కార్యదర్శి బండ్రెడ్డి గోవర్ధన గోపాలకృష్ణ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగం అభ్యున్నతికి యూనియన్ చేస్తున్న కృషిని పలువురు నాయకులు వివరించారు. యూనియన్ మండలశాఖ అధ్యక్షుడు తెనాలి శ్రీనుబాబు బండ్రెడ్డి సాంబశివరావు, నబ్బినేని సురేషబాబు, బండ్రెడ్డి శివరామకృష్ణ, మద్ది శ్రీనివాసరావు, సీనియర్ నేతలు ఎస్‌బీబీవీ ప్రసాద్, వనమా రామకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు, టి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఈఎఫ్ చర్చ్ 90వ వార్షికోత్సవం



మచిలీపట్నంటౌన్: స్థానిక మల్కాపట్నంలోని ఎల్ఈఎఫ్ చర్చ్ 90వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్తుతి ఆరాధన ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి తంటేపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ సమాజంలో శాంతి, సంతోషం, సమాధానం వెల్లివిరిసేలా మనుష్యులను నడిపించాలన్న గొప్ప ఉద్దేశంతో ఎల్ఈఎఫ్ చర్చ్ 1935లో మద్రాసు నగరంలో ఎస్. దానియేలు ద్వారా స్థాపించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకుడిగా విజయవాడ నుంచి విచ్చేసిన బ్రదర్ ప్రియనాథ్ మాట్లాడుతూ ఎల్ఈఎఫ్ చర్చ్ 90ఏళ్లుగా దేవుని సేవలో, అనేక కుటుంబాలను కట్టుటలో, యువతలో పరివర్తన, జీవిత మార్పును కలిగించే విధంగా అనేకులకు మార్గదర్శకంగా ఉందన్నారు.

నీళ్లు లేక నెర్రెలు



విశ్వనాథపల్లి సమీపంలో నీరు అందక ఎండిపోతున్న నారుమడి



కోడూరు నార్త్ చానల్ 6ఏ కింద నెర్రెలిచ్చిన పొలం

సాగునీరు అందక నారుమళ్లు ఎండిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం సాగునీరు అందించడంతో పూర్తిగా విఫలమవ్వడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దివిసీమలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో సాగునీటి సంక్షోభం రోజు రోజుకు తీవ్రతరమవుతోంది. ప్రస్తుతం కోడూరు మండలంలోని నార్త్ చానల్ 6ఏ కాలువ కింద సాగు చేసిన పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయి. కాలువ వెంట సాగునీరు పూర్తిస్థాయిలో రాకపోవడంతో విశ్వనాథపల్లి, పిట్టల్లంక, సాలెంపాలెం రైతులు నీటిని నారుమళ్లలోకి మళ్లించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఆయిల్ ఇంజిన్లకు కూడా నీరు అందని పరిస్థితి నెలకొనడంతో అన్నదాతలు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం వారుమళ్లు నీరు లేక నెర్రెలిచ్చాయి. నారుమడిలోని నేలమొత్తం నెర్రెలివ్వడంతో పంట ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది వ్యవసాయ పనులకు విరామం పలుకక తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వెంటనే సాగునీటిని అందించి పంటను రక్షించాలని రైతులు కోరుతున్నారు. – కోడూరు

పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీల నియామకం

గూడూరు: మండల పరిధిలోని నాలుగు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో పీఏసీఎస్‌కు చైర్ పర్సన్, ఇద్దరు పర్సన్‌లతో కూడిన కమిటీలను వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫీషియో చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో 11 పీఏసీఎస్‌లకుగాను ఇప్పటికే జక్కంచర్ల, ఆకులమన్నాడు కమిటీల నియామకం పూర్తి కాగా, తాజాగా ముక్కొల్లు, కంకటావ, రామానుజవత్తర్లపల్లి, రామన్నపేట పీఏసీఎస్‌లకు కమిటీలను నియమించారు. ముక్కొల్లు చైర్‌పర్సన్‌గా సమ్మెట రాఘవప్రసాద్, పర్సన్లుగా శాకల మహంకాళ రావు, ముక్కు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కంకటావ పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా సుంకర రవీంద్రనాథ్ ఠాగూర్, పర్సన్‌లుగా వాకా చిన అమలేశ్వర రావు, దోనే అరుణ, రామానుజవత్తర్లపల్లి చైర్ పర్సన్‌గా పలగాని సీతామహాలక్ష్మి, పర్సన్‌లుగా జంపన గౌతు మహేశ్వరరావు, మురాల ఈశ్వర రావు, రామన్నపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మురాల ధనుష్, పర్సన్‌లుగా మాతంగి సుబ్బారావు, పరసా ప్రశాంతి నియమితులయ్యారు. వీరి పదవీకాలం 2026 జనవరి 30 వరకు ఉంటుంది.

కోడూరులో..

కోడూరు: కోడూరు పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా పూతబోయిన కరుణకుమార్, పర్సన్లుగా పూతబోయిన శ్రీనివాసరావు, మాలే వెంకటేశ్వరరావు, వి.కొత్తపాలెం పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా రేపల్లె పిచ్చేశ్వరరావు, పర్సన్లుగా రేపల్లె నాగమల్లేశ్వర రావు, బాదర్ల నాగమల్లేశ్వరరావు, విశ్వనాథపల్లి పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా తోట సాంబయ్య, పర్సన్లుగా కైతేపల్లి పానకాలరావు, విశ్వనాథపల్లి వేణులు నియమితులయ్యారు. ఉల్లిపాలెం పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా బొలిశెట్టి విఠలరావు, పర్సన్లుగా విశ్వనాథపల్లి ప్రభుదాస్, బడే శ్రీనివాసరావు, సాలెంపాలెం పీఏసీఎస్‌కు కొప్పనాతి సత్యనారాయణ, పర్సన్లుగా మెండు బ్రహ్మయ్య, కొక్కిలిగడ్డ వరప్రసాద్, బడేవారిపాలెం పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా మర్రే గంగయ్య, పర్సన్లుగా గాదె భాస్కరరావు, నడకుదిటి రాజగోపాల్ రావు, లింగారెడ్డిపాలెం చైర్‌పర్సన్‌గా కోట సుబ్బారావు, పర్సన్లుగా నల్లూరి చినభావశంకరరావు, ఉప్పాల వెంకటకోటేశ్వరరావు నియమితులయ్యారు.

పర్చూరి గోపాలరావుకు నివాళి



బందలాయిచెరువు(అవనిగడ్డ): సీపీఐ(ఎంఎల్) పార్టీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ పర్చూరి గోపాలరావు 45వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ పరిధిలోని బందలాయిచెరువు వద్ద పర్చూరి, మాజీ జెడ్పీటీసీ అడపా రామకోటేశ్వరరావు స్మారక స్థూపాల వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి గాజుల జయగోపాల్, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, పర్చూరి శ్రీనివాసరావు, ఫణి నివాళులర్పించారు. పర్చూరి గోపాలరావు తనయుడు పర్చూరి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పర్చూరి రామచంద్రరావు, మాజీ సర్పంచ్ తుంగల సాంబశివరావుతో పాటు పలువురు పర్చూరి అభిమానులు పర్చూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వంతెన.. ప్రమాదం అంచున

బోళ్లపాడు వంతెన రక్షణగోడ కూలినా పట్టించుకోని అధికారులు



కూలిపోయిన బోళ్లపాడు భీమనది డ్రెయిన్ పై ఉన్న వంతెన రక్షణ గోడ

మల్లంపల్లి(ఘంటసాల): మండల పరిధిలోని మల్లంపల్లి గ్రామానికి వెళ్లాలంటే ఆ వంతెన ఒక్కటే ఆధారం. ఇటీవలే ఆ వంతెన రక్షణ గోడ కూలడంతో స్కూల్ బస్సులతో సహా ఇతర వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలే తాత్కాలికంగా రెండు స్తంభాలు అడ్డుపెట్టారు. అయినప్పటికీ వర్షం పడితే ఈ వంతెనపై వాహనాలు వెళ్లడం లేదు.

పొంచి ఉన్న ప్రమాదం..

ఘంటసాల మండలం మల్లంపల్లి పంచాయతీ శివారు బోళ్లపాడుకు రాకపోకల కోసం 52 ఏళ్ల క్రితం భీమనదిపై వంతెన నిర్మించారు. 2014లో ఈ వంతెనకు ఒక వైపు గోడ కూలిపోగా.. అప్పట్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపి వేశారు. కొత్త వంతెన నిర్మిస్తామని ఆనాడు అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా ఇంతవరకూ పట్టించుకోలేదు. రెండో వైపు గోడ కూడా నెలరోజుల కిందట కూలిపోయింది. దీనికి తోడు వంతెన రోడ్డు కుంగిపోయి మరింత ప్రమాదకరంగా మారింది. వర్షం పడితే ఈ వంతెనపై వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ద్విచక్ర వాహనదారులు అయితే ఈ వంతెనపై తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. శిథిలమైన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలని గ్రామస్తులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బోళ్లపాడు గ్రామస్తులు నిత్యావసర సరుకులు కావాలన్నా, ఆస్పత్రికి వెళ్లాలన్నా, పాఠశాలలు విద్యార్థులను పంపాలన్నా ఈ వంతెనపై ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బోళ్లపాడు వద్ద గతంలో కూలిన వంతెన రక్షణ గోడ స్థానంలో వేసిన తాటిబొందలు



బోళ్లపాడు భీమనది డ్రెయిన్‌పై ఉన్న వంతెన వద్ద పడేందుకు సిద్ధంగా ఉన్న రక్షణ గోడలు

చిన్నచూపు తగదు..



బోళ్లపాడు గ్రామంలో భీమనది చానల్‌పై ఉన్న వంతెన రక్షణ గోడ కూలి 20 రోజులు దాటుతున్నా ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధి కన్నెత్తి చూడలేదు. 400 మందికి పైగా జనాభా ఉన్న మా ఊరి ప్రజలు వ్యవసాయ పనులు, పనులకు, చదువుకునే వారు అందరూ ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. ఏ క్షణంలో కూలిపోతుందోనని భయం భయంతో ప్రయాణం చేస్తూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– అంగడాల నాగరాజు, బోళ్లపాడు

భయపడుతున్నాం..



గతంలో వంతెన బాగున్నప్పుడు స్కూల్ బస్సులు, ఆటోలు, వ్యానులు గ్రామంలోకి వచ్చేవి. దీంతో పనులకు వెళ్లిన భయం ఉండేది కాదు. ఇప్పుడు వంతెనకు ఉన్న రెండు రక్షణ గోడలు కూలిపోవడంతో వాహనాలు మా గ్రామంలోకి రాకపోవడంతో సుమారు అర కిలో మీటరు దూరం వెళ్లి విద్యార్థులను, చిన్నారులను పంపించాల్సిన పరిస్థితి. అత్యవసర ఆరోగ్య పరిస్థితులు వస్తే వాహనాలు గ్రామంలోకి రావడానికి భయపడుతున్నారు.

– లోయ నాగేశ్వరరావు, బోళ్లపాడు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫారం



కోసూరువారిపాలెం కరకట్ట వద్ద ప్రమాదంగా ఒరిగిపోయిన విద్యుత్ టాన్స్ ఫారం

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెం-చిరువోలు కృష్ణా కరకట్ట వద్ద రైతు కోసూరు వరదలయ్య పొలం దగ్గర విద్యుత్ పోల్‌కు ఏర్పాటు చేసిన టాన్స్‌ఫారం వంగిపోయి ప్రమాదంగా మారింది. గాలులకు ఏ క్షణాన పడిపోతుందోనని రైతులు, గ్రామస్తులు భయపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కోసూరువారిపాలెం గ్రామ మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు, రైతులు తెలిపారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫారాన్ని సరిచేయాలని కోరారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అవనిగడ్డ: స్థానిక నాగాయలంక రోడ్‌లోని నూతన సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాని నిలిపివేయనున్నట్లు ఉయ్యూరు డివిజన్ ఈఈ డి. కృష్ణనాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల క్రమబద్ధీకరణ, చెట్లు కొమ్మల తొలగింపు వల్ల ఎడ్లంక, గుడివాకవారిపాలెం, వేకనూరు, తుంగలవారిపాలెంలో పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరాని నిలిపివేస్తున్నట్లు ఈఈ చెప్పారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: వర్షంలో సైతం శ్రీ కొండలమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూల్లో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

బందరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆశాలత



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

మచిలీపట్నంటౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదాతలుగా మారాలని స్థానిక జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత కోరారు. మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బెల్ ఆడిటోరియంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆశాలత మాట్లాడుతూ రక్తాన్ని మాత్రమే కృత్రిమంగా తయారు చేయలేమని, రక్తం కొరతతో ఎంతో మంది రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని అలాంటి వారి ప్రాణాలు కాపాడేందుకు దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. ఫలితంగా ఎంతోమంది ప్రాణాలను కాపాడిన వారు అవుతారన్నారు. ఈ సందర్భంగా 50 మంది యువతి, యువకులు రక్తదానం చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కాసాని ప్రసాద్ ఆధ్వర్యంలో పిల్లారిశెట్టిపాలెం గ్రామానికి చెందిన 24 మంది యువకులు ఈ సందర్భంగా రక్తదానం చేయటం విశేషం. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ పావని, మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు వేణు కుమార్, గౌరవాధ్యక్షుడు ఏఆర్‌కే వరప్రసాద్, సహాయ కార్యదర్శి దీప్తి, బ్లడ్ కమిటీ చైర్మన్ రమాదేవి, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్, సభ్యులు పాల్గొన్నారు.

ఐఓఎల్ శస్త్ర చికిత్సకు 50మంది ఎంపిక



వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్‌లు, సంస్థ ప్రతినిధులు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి(పెదకాకాని), ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, సుదర్శి మానవతా సంస్థ సంయుక్తంగా ఆదివారం 55వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించాయి. స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో 83మందికి డాక్టర్ నవీన్, డాక్టర్ స్రిమాన్ కంటి పరీక్షలు జరిపి వీరిలో 52మందిని ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి ఉచిత శస్త్ర చికిత్స కోసం ప్రత్యేక బస్సులో శంకర కంటి ఆస్పత్రికి పంపించారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, ఆస్పత్రి క్యాంప్ ఇన్‌చార్జి ప్రసన్నకుమార్, తలశిల లీలామనోహర్, మత్తి శివ, కనిగంటి అజయ్ శిబిరంలో రోగులకు సేవలు అందించారు.

తీరప్రాంత గ్రామస్తులకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మెరైన్ ఎస్ఐ పూర్ణమాధురి

కోడూరు: సముద్రతీర ప్రాంత గ్రామస్తులకు ఆదివారం మెరైన్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పాలకాయతిప్ప గ్రామంలో మెరైన్ ఎస్ఐ పూర్ణమాధురి గ్రామస్తులకు వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తాయని, గ్రామస్తులకు భరోసా కల్పించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. గ్రామస్తులకు ఏమైనా సమస్యలు ఉంటే గ్రామంలో ఉన్న మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖతో కలిసి పని చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. సాగర్‌మిత్ర సీహెచ్ మోషే, వీఆర్ఏలు కె.అర్జున్, ఎన్.గోపిచంద్ పాల్గొన్నారు.

ఆవుకు అంతిమయాత్ర



మృతి చెందిన ఆవును ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న హరికృష్ణ, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

చల్లపల్లి: తాను పెంచుకున్న ఆవు మృతి చెందటంతో దానిని ఊరేగించి ఘనంగా అంతిమ సంస్కారాలు నిర్వహించిన ఘటన స్థానికంగా చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన వేముల హరికృష్ణ, వేముల శ్రీనివాసరావు అన్నదమ్ములు. ఇద్దరూ కలిసి గత 20ఏళ్లుగా ఆవును పెంచుతున్నారు. నిత్యం దాని ఆలనా.. పాలనా.. చూస్తూ గోమాతను అల్లారుముద్దుగా పెంచుకున్నారు. ఆదివారం ఆవు అనారోగ్యంతో మృతి చెందటంతో ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగిపోయారు. దానికి పసుపు, కుంకుమ, చీరసారె సమర్పించి మంగళ వాయిద్యాలతో బాణాసంచా కాలుస్తూ ట్రాక్టర్‌పై ఊరంతా ఊరేగించారు. అనంతరం కృష్ణాతీరమైన నడకుదురులో ఆవును ఖననం చేశారు.

కొల్లూరికి జాతీయ సేవా పురస్కారం



జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న కొల్లూరి సత్యనారాయణ

పెడన: పెడన పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణకు వైశ్యరత్న జాతీయ సేవా పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ సంస్థ వ్యవస్థాపకుడు కాంపల్లి సత్యనారాయణ హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన స్వర్ణగిరి దేవాలయం ఫౌండర్, చైర్మన్ మానేపల్లి రామారావు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత తదితరులు చేతుల మీదుగా కొల్లూరిని సత్కరించి ప్రశంసాపత్రంతో పాటు అవార్డును అందజేశారు. సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బ్రాహ్మణ మహిళా సేవా వాహిని మహిళా నాయకురాలు తిరుమల వింజమూరి సంధ్యారాణి, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్ మామిడి వెంకట వరప్రసాదరావులతో పాటు వివిధ ఆర్యవైశ్య సంఘాల నాయకులు కొల్లూరికి అభినందనలు తెలిపారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని ధర్నా

పెనమలూరు: యనమలకుదురు గ్రామం సుగాలీ కాలనీలో డ్రెయినేజీ సమస్యను తాడిగడప మున్సిపాలిటీ పరిష్కరించటం లేదని నిరసన వ్యక్తం చేస్తూ స్థానికులు ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో సుగాలీకాలనీ, భగత్ సింగ్‌నగర్, వైఎస్సార్ నగర్, అంబేడ్కర్‌నగర్, బీసీ కాలనీల్లో పలు ప్రాంతాల్లో మురుగునీటి పారుదలకు ఉన్న సీసీ డ్రెయినేజీ వ్యవస్థ గత 2024లో అధిక వర్షాల వలన కూలిపోయిందన్నారు. అప్పటి నుంచి డ్రెయినేజీకి మరమ్మతులు చేయటం కాని, నూతన డ్రెయినేజీ నిర్మాణం కాని చేయలేదని తెలిపారు. ఈ కారణంగా మురుగు నీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని, దోమలు విజృంభిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మఠకన్యలపై అక్రమ కేసులకు నిరసనగా ర్యాలీ

పెనమలూరు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో క్రైస్తవ మఠకన్యలను అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా ఆదివారం కానూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. కర్మేల్ మాత పుణ్యక్షేత్రం విచారణ గురువు సలివేంద్రశౌరి మాట్లాడుతూ సమాజంలో అన్ని మతాలు సమానమే అన్నారు. అందరూ కలిసి మెలిసి ఉండాలని కోరారు. రాజ్యాంగంలో ఉన్న హక్కుల కోసం క్రైస్తవులు పోరాటం చేయాలన్నారు. రెవరెండ్ సిస్టర్ గీతి మాట్లాడుతూ ఇద్దరు మఠకన్యలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. అన్నిమతాలు సమానమేనని అన్నారు. హక్కులు హరించే అధికారం ఎవ్వరికీ లేదన్నారు. ఈ సందర్భంగా కర్మేల్ మాత పుణ్యక్షేత్రం నుంచి కామయ్యతోపు అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్

99122 20543 (మచిలీపట్నం, పెడన)

79955 66983 (అవనిగడ్డ)

Office mail : sakshiads@gmail.com